నిజామాబాద్



కామారెడ్డి

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

గురువారం 17 -07-2025


## తెలంగాణ విశ్వవిద్యాలయం రాష్ట్రంలోనే అగ్రస్థానంలో : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.

అంగరంగ వైభవంగా స్నాతకోత్సవం, విద్యా ప్రగతిపై ప్రశంసలు.

## రాష్ట్ర గవర్నర్ పర్యటనకు జిల్లాలో ఘన స్వాగతం









నిజామాబాద్, జూలై 16 ప్రజాగళం న్యూస్ : రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నిజామాబాద్ జిల్లాలో పర్యటించారు. ఆయనకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సత్కారం నిర్వహించారు. ఉదయం 11:05 గంటలకు డిచ్పల్లిలోని పోలీస్ బెటాలియన్ కు చేరుకున్న గవర్నర్‌కు పూల మొక్కలతో గౌరవ వందనం ఇస్తూ విద్యార్థినులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు కేఆర్. సురేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ, తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరి తదితరులు గవర్నర్‌కు స్వాగతం తెలిపారు. గౌరవ వందనం అనంతరం గవర్నర్ బెటాలియన్ గెస్ట్ హౌస్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ప్రత్యేక కాన్వాయ్‌లో తెలంగాణ విశ్వవిద్యాలయం చేరుకుని, స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ పర్యటన నేపథ్యంలో ఎలాంటి లోపాలూ, అవాంఛనీయ ఘటనలూ జరగకుండా ఉండేందుకు జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి నేతృత్వంలో విస్తృత స్థాయి ఏర్పాట్లు చేపట్టారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు కొనసాగించడమైంది.

## క్షయ వ్యాధి నిర్మూలనలో

# అందరి భాగస్వామ్యం అవసరం :






### టీ.బీ ముక్త్ భారత్ అభియాన్ పై నిజామాబాద్‌లో సమీక్ష సమావేశం

### గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

నిజామాబాద్, జూలై 16 ప్రజాగళం న్యూస్ :భారతదేశాన్ని క్షయ వ్యాధి రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'టీ.బీ ముక్త్ భారత్ అభియాన్' లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సముదాయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సమిష్టి కృషితోనే క్షయ వ్యాధి నిర్మూలన సాధ్యమవుతుందని, అందరూ బాధ్యతతో ముందుకు రావాలని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు తమ ప్రతిభను ఉపయోగించి సామాజిక బాధ్యతగా టీ.బీ నిర్మూలన కార్యక్రమానికి తోడ్ప డాలని సూచించారు. సాహిత్యం, కళలు, క్రీడ, సేవా రంగాల్లో ప్రతిభ ఉన్నవారు తమ సృజనాత్మకతతో చైతన్య వంతమైన ప్రచారం జరపాలని ఆయన ఆకాంక్షించారు. అంత ర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చిన మలావత్ పూర్ణ, గుగులోత్ సౌమ్యలను రాష్ట్ర బ్రాండ్ అంబాసిడర్ లుగా ప్రకటించాలని సూచించారు. జిల్లా యంత్రాంగం, రెడ్ క్రాస్ సమన్వయంతో విస్తృత స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించి, క్షయ వ్యాధిని ముందస్తుగా గుర్తించి సమయానికి చికిత్స అందించాలన్నారు. టీ.బీ బాధితులకు పోషకాహార కిట్లు అందించేందుకు దాతల సహకారం తీసు కోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, జిల్లా స్థితిగతులపై గవర్నర్ కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. హై రిస్క్ గ్రూపులపై ప్రత్యేక దృష్టితో స్క్రీనింగ్, తెమడ పరీక్షలు నిర్వహి స్తున్నామని తెలిపారు. ఎక్స్ రే పరీక్షల కోసం అవసర మైన యంత్రాల కొనుగోలుకు నిధులు కేటాయించినట్లు తెలి పారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో టీ.బీ బాధితులకు పోషకా హారాన్ని అందజేస్తున్నామని చెప్పారు. 2022-23 సంవత్సరానికి గాను క్షయ వ్యాధి నిర్మూలనలో గోల్డ్ మెడల్ సాధిం చామని, తలసేమియా బాధితులకు రక్త సౌకర్యం, వృద్ధుల కోసం వృద్ధాశ్రమ నిర్వహణ వంటి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను రెడ్ క్రాస్ సమర్థంగా నిర్వహిస్తున్నదన్నారు. ఈ సమీక్షలో ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. గవర్నర్ జిల్లా యం త్రాంగం నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రశంసిస్తూ, దేశానికి ఆదర్శంగా నిలిచేలా నిజామాబాద్ జిల్లాను తీర్చిదిద్దాలని సూచించారు.

## వేల్పూర్ మండలంలో శాంతిభద్రతల దృష్ట్యా 163 BNSS అమలు - పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య



నిజామాబాద్ జులై 16 ప్రజాగళం న్యూస్ : నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలో శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా భారత న్యాయ స్మృతి సంహిత సెక్షన్ 163 ప్రకారం నిషేధిత ఉత్తర్వులు జారీ చేసినట్టు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ బుధవారం వెల్లడించారు. ఈ మేరకు జూలై 17వ తేదీ ఉదయం 6 గంటల నుండి జూలై 18వ తేదీ ఉదయం 6 గంటల వరకు, వేల్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని వెల్లడించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉం డేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు కమిషనర్ పేర్కొన్నారు. ఈ కాల వ్యవధిలో నలుగురు లేదా అంతకంటే ఎక్కువ వ్యక్తులు ఒకేచోట గుమిగూడకూడదని స్పష్టం చేశారు. నిర్బంధిత ప్రాంతాల్లో సమూహాలు ఏర్పరిచినట్టయితే, వారి మీద చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ప్రజలు పోలీసులు జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా ప్రవర్తించాలని, నిబంధనలను పాటిస్తూ శాంతిని కాపాడేందుకు సహకరించాలని కోరారు. పోలీసులు ప్రజల రక్షణకై ఈ చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో, హితవు పాటించమని సూచించారు. ఈ ఉత్తర్వులు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్. అధికారికంగా జారీ చేశారు.

## నిజామాబాద్ జిల్లా ప్రముఖులతో...

# గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇష్టాగోష్టి

### ఫొటో ఎగ్జిబిషన్ సందర్శన, వివిధ రంగాల ప్రతి నిధులతో చర్చా కార్యక్రమం..



నిజామాబాద్, జూలై 16 ప్రజాగళం న్యూస్ : తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాకు చెందిన వివిధ రంగాలలో ప్రఖ్యాతిగాంచిన ప్రముఖులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం కలెక్టరేట్‌కు విచ్చేసిన గవర్నర్‌ను శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఇతర అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫొటో ఎగ్జిబిషన్‌ను గవర్నర్ మొదటగా సందర్శించారు. జిల్లా అభివృద్ధి ప్రగతిని ప్రతిబింబించే ఈ ఎగ్జిబిషన్ లో కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి వివిధ శాఖల పనితీరు, ప్రాధాన్యతలను వివరించారు. గవర్నర్ ప్రదర్శనను ఆసక్తితో తిలకించారు. అనంతరం జిల్లాకు చెందిన కవులు, రచయితలు, కళాకారులు, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు, సామాజిక సేవకులు తదితర 40 మందికి పైగా ప్రముఖులతో గవర్నర్ సమావేశమై వారితో స్వచ్ఛమైన చర్చ జరిపారు. పిన్న వయసులో ఎవరెస్టును అధిరోహించిన మలావత్ పూర్ణ, అంతర్జాతీయ ఫుట్ బాల్ క్రీడాకారిణి గుగులోత్ సౌమ్య, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతో గౌరవింపబడ్డ రచయిత రమేష్ కార్తీక్ నాయక్ లతోపాటు వివిధ రంగాలలో సేవలందిస్తున్న కళా, సాహిత్య, సేవా ప్రతినిధులను గవర్నర్ ఒక్కొక్కరిగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బల్లాష్టు మల్లేష్, కందకుర్తి యాదవరావు, చిన్ని కృష్ణుడు, అమృతలత, నాలేశ్వరం శంకరం, పాయల్ కోట్గిర్కర్, అష్ట గంగాధర్, గణపతి అశోక శర్మ, తల్లావజ్జల మహేష్ బాబు, బి.కళా గోపాల్, మద్దుకూరి సాయిబాబు, కైరకొండ బాబు, చిందు బాబయ్య, మహమ్మద్ రషీద్, గంగాదేవి, జయలక్ష్మి, సాయి లవోల, టి. స్వప్నా రాణి, అష్ఫాక్ ఆసీఫ్, దారం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. చర్చ అనంతరం గవర్నర్ ప్రతి ఒక్కరితో ముచ్చటించి వారి అభిప్రాయాలు, విజ్ఞప్తులు తెలుసుకున్నారు. కార్యక్రమ ముగింపులో జిల్లా అధికారులతో పాటు ప్రముఖులతో ఫోటో సెషన్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీతో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. గవర్నర్ సందర్శనను పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టి, సమర్థవంతంగా కార్యక్రమాన్ని నిర్వహించింది.



## బీసీలకు రాజకీయ అవకాశాలు దక్కే వరకు తెలంగాణ జాగృతి పోరాటం కొనసాగుతుంది : కల్వకుంట్ల కవిత.

సబ్‌కోటా, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి..


మిగతా 2 లో


## మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం. : పోచారం.

బాన్సువాడ, జూలై 16, ప్రజా గళం. రాష్ట్రంలోని మహిళలను ఆర్థికంగాబలోపేతం చేయడమే ప్రభుత్వలక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు బాన్సువాడఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు.బుధవారం బాన్సువాడ పట్టణంలోని ఎస్ఎంబి ఫంక్షన్ హాల్ లో బాన్సువాడ అర్బన్, రూరల్, బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పురోగతి పై, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ తో కలిసి ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగాఆయనమాట్లాడారు.మహిళలకుచేయూతనివ్వడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. డాక్వా మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఎలక్ట్రిక్ బస్సులు, పెట్రోల్ బంకులు అందించడానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, మున్సిపల్ కమిషనర్ శ్రీ హరి రాజు, ఎమ్మార్వో వరప్రసాద్, బీర్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల, మాజీ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, మోహన్ నాయక్, యండి. దావూద్, నార్ల ఉదయ్ ప్రజా ప్రతినిధులు నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
గురువారం
17 -07-2025

# తెలంగాణ విశ్వవిద్యాలయం రాష్ట్రంలోనే అగ్రస్థానంలో : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.

## అంగరంగ వైభవంగా స్నాతకోత్సవం, విద్యా ప్రగతిపై ప్రశంసలు.


















నిజామాబాద్, జూలై 16 ప్రజాగళం న్యూస్ :తెలంగాణ రాష్ట్ర గవర్నర్ మరియు విశ్వవిద్యాలయ ఛాన్సలర్ మాన్య శ్రీ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న తెలంగాణ విశ్వవిద్యాలయం విద్యా, పరిశోధన రంగాల్లో ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. బుధవారం విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన రెండవ స్నాతకోత్స వంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. గౌరవ వందనం, స్నిఫర్ డాగ్, బాంబు డిస్పోజల్ టీంల పర్యవేక్షణలో అత్యుత్తమ భద్రతా ఏర్పాట్ల మధ్య జరిగిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

గవర్నర్ కు ఆర్ఎస్ఐ కొమ్ము శ్రీకాంత్ ఆధ్వర్యంలో గాడ్ ఆఫ్ హెూనర్ సమర్పించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, తెలంగాణ విశ్వవిద్యాలయం స్థాపితమైన 2006లో కేవలం ఆరు కోర్సులతో ప్రారంభమై, ప్రస్తుతం ఏడు విభాగాలలో 31 కోర్సులతో నూతన శిఖరాలను అధిరోహిస్తోం దని ప్రశంసించారు. భిక్నూర్, సారంగాపూర్ క్యాంపస్‌లతో పాటు ప్రధాన క్యాంపస్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. చైతన్యవం తమైన మట్టిలో పుట్టిన విద్యార్థుల సామర్థ్యం, అధ్యాపకుల అంకితభావం, పాలనా సిబ్బంది కృషి ఈ ప్రగతికి మూలస్తంభంగా నిలుస్తున్నా యని పేర్కొన్నారు. విద్య కేవలం పాఠశాల గదుల్లో ముగిసిపోకూడదని, సమాజాన్ని తీర్చిదిద్దే మార్గదర్శకంగా మారాలని అన్నారు. కొఠారి కమిషన్ అభిప్రాయాలను ఉ దహరిస్తూ, "దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే తీర్చిదిద్ద బడుతుంది" అన్న మాటల ప్రాధాన్యాన్ని గుర్తు చేశారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరిరావు మాట్లాడుతూ, స్నాతకోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడంతో పాటు విశ్వవిద్యాలయ భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల స్థాపన, 500 మంది విద్యార్థినుల కోసం బాలికల హాస్టల్, 1000 మంది సామర్థ్యంతో ఆధునిక ఆడిటోరియం, క్రీడా మైదానం అభివృద్ధి వంటి పలు మౌలిక సదుపాయాలపై కృషి చేస్తున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల వరకు విస్తరించే యోచనను కూడా వెల్లడించారు. గడచిన 19 సంవత్సరాల్లో కలిసికట్టుగా పనిచేసిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల కృషి ఫలితంగా విశ్వవిద్యాలయం విశేష పురోగతి సాధించిందని తెలిపారు. ఈ స్నాతకోత్సవంలో 15 విభాగాల నుంచి 132 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 156 మంది పరిశోధకులకు డాక్టరేట్ డిగ్రీలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన భారత రసాయన శాస్త్ర సాంకేతిక సంస్థ మాజీ డైరెక్టర్ ఆచార్య శ్రీవారి చంద్రశేఖర్ మాట్లాడుతూ, విద్యార్థుల నైపుణ్యాల ద్వారా విస్తృతంగా అవకాశాలు పొందే అవకాశం ఉందని, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు గంటా చంద్రశేఖర్, అపర్ణ, రాంబాబు, లావణ్య, శ్రీనివాసులు, ప్రవీణ్ మామిడాల, హారతి, నాగరాజు, విద్యావర్ధిని, కనకయ్య, పి.ఆర్.ఓ డైరెక్టర్ డా. ఏ.పున్నయ్య, ఇతర బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు భారీగా హాజరయ్యారు. సంపూర్ణంగా నిర్వహించబడిన ఈ స్నాతకోత్సవం విద్యా రంగంలో తెలంగాణ విశ్వవిద్యాలయ ప్రతిష్టను మరింతగా పదిలం చేసిన మైలురాయిగా నిలిచింది.

# నిజామాబాద్‌లో గవర్నర్‌కు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఘన స్వాగతం.

## అభివృద్ధిపై సమీక్షకు హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.



ఇందూర్ నగరం, జూలై 16 ప్రజాగళం

# తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

## డిచ్‌పల్లిలో గవర్నర్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం



నిజామాబాద్, జూలై 16 (ప్రజాగళం న్యూస్) : తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ బుధవారం నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమానికి విచ్చేశారు. ఈ సందర్భంగా డిచ్‌పల్లి 7వ బెటాలియన్ వద్ద గవర్నర్‌ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్., మర్యాదపూర్వకంగా కలిసారు. గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తూ స్వాగతం పలికిన కమిషనర్ సాయి చైతన్య, జిల్లా భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ వ్యవస్థ పర్యవేక్షణ తదితర అంశాలపై గవర్నర్‌తో సంక్షిప్తంగా చర్చించారు. గవర్నర్ పర్యటన సందర్భంగా జిల్లా పోలీస్ విభాగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా బెటాలియన్ ఆవరణలో గౌరవ వందనం కూడా నిర్వహించబడింది. గవర్నర్ పర్యటన సజావుగా సాగేందుకు పోలీస్ విభాగం చర్యలు ప్రశంసనీయంగా నిలిచాయి.

# బీసీలకు రాజకీయ అవకాశాలు దక్కే వరకు తెలంగాణ జాగృతి పోరాటం కొనసాగుతుంది : కల్వకుంట్ల కవిత.

## సబ్‌కోటా, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి..





హైదరాబాద్, జూలై 16 ప్రజాగళం న్యూస్ : బీసీలకు రాజకీయంలో సమాన హక్కులు లభించే వరకు ఉద్యమం కొనసాగుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బుధవారం బంజారాహిల్స్‌లో తన నివాసంలో యూపీఎఫ్ నేతలు, 72 బీసీ కులాల ప్రతినిధులతో ఆమె సమావేశమ య్యారు. ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో పాటు ఇప్పటివరకు రాజకీయ అవకాశాలు దక్కని కులాలకు సబ్‌కోటా విధానం అమలు చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. వార్డు మెంబర్ స్థాయి నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ వరకు 25 వేల మంది బీసీ నాయకులను నిలబెట్టే లక్ష్యంతో తెలంగాణ జాగృతి పోరాటం సాగుతుందని చెప్పారు. అందులో సగభాగం స్థానాలు మహిళలకే దక్కేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న బీసీ రిజర్వేషన్ల పెంపు తీర్మానం గవర్నర్ వద్ద ఆమోదించాల్సి ఉందని, ఆర్డినెన్స్ ఇచ్చిన తర్వాత హైకోర్టులో కేవియట్ వేయకుండా ఉంచితే అది రిజర్వేషన్ల అమలుకు విఘాతం కలిగించవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఉన్నా, సబ్ కేటగిరైజేషన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోగలదని గుర్తు చేశారు. కేవియట్ వేయకపోతే రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఇక విద్యార్థుల సమస్యల విషయానికి వస్తే, రూ. 8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్రంగా ప్రభావితమవుతు న్నారని తెలిపారు. తక్షణమే ఈ బకాయిలు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తు నిరీక్షణలో పడకూడదని డిమాండ్ చేశారు. ఈ సమావేశం ద్వారా బీసీ సామాజిక, రాజకీయ ప్రయోజనాల సాధన దిశగా మళ్లీ ఒకటిగా సంఘటిత కృషికి వేదికగా నిలిచింది. ప్రభుత్వ వైఖరిపై త్వరలో న్యాయవాదులతో చర్చించి తుది కార్యాచరణ రూపొందిస్తామని కవిత పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల స్థలాలపై బీఆర్ఎస్ నాయకుల కబ్జా ప్రయత్నం..

## ఆక్లూర్ గ్రామ మహిళా లబ్ధిదారుల ఆవేదన..



నిజామాబాద్ జూలై 16 (ప్రజాగళం) : నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ మండలం ఆక్లూర్ గ్రామంలో 1994లో కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను బీఆర్ఎస్ నాయకులు అక్రమంగా స్వాధీనం చేసుకుంటున్నారని లబ్ధిదారులైన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు కేటాయించిన 94 స్థలాల్లో ప్రస్తుతం ఇంటి నిర్మాణానికి ముందుకొస్తున్న మహిళలను బెదిరిస్తూ, దాడులకు దిగుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. స్థానిక నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, రెవెన్యూ అధికారులు సైతం కబ్జాదారులకు మద్దతు ఇస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. గత టీఆర్ఎస్ హయాంలో కొన్ని స్థలాలను అక్రమంగా ఇతరుల పేర్లపై పట్టాలు చేయించుకున్నారని మహిళలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో పోలీస్, రెవెన్యూ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి, అసలైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని గ్రామస్థులు, బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ఆక్లూర్ సంఘటనపై బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి స్పందించి మధ్యవర్తిత్వం వహించాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రశాంత్ రెడ్డి అబద్ధపు ప్రచారాలకు తెరదించేందుకు కాంగ్రెస్ కనువిప్పు సభ.

## గల్ఫ్ బాధితుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి చూపిన సంక్షేమం స్పష్టం చేస్తాం: మానాల మోహన్ రెడ్డి.



నిజామాబాద్, జూలై 16 ( ప్రజా గళం ప్రతినిధి )గల్ఫ్ బాధితుల పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను నిరాకరిస్తూ అసత్య ప్రచారానికి పాల్పడుతున్న బీఆర్ఎస్ నేత ప్రశాంత్ రెడ్డికి వాస్తవాలు తెలియజేయడానికి కాంగ్రెస్ పార్టీ గురువారం (జూలై 17) ఉదయం 10 గంటలకు వేల్పూర్‌లో ప్రత్యేక కనువిప్పు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. ప్రశాంత్ రెడ్డి గతంలో పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ గల్ఫ్ బాధిత కుటుంబాలకు అండగా నిలవలేదని, వారి సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. ఇక ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి గల్ఫ్‌లో అనుకోని కారణాలతో మరణించినవారి కుటుంబాలను ఆదుకునే విధంగా ప్రత్యేకంగా గల్ఫ్ ఎన్ ఆర్ ఐ సెల్‌ను ఏర్పాటు చేశారని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మానవతా ధోరణిని ప్రశాంత్ రెడ్డి గణించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రశాంత్ రెడ్డికి వాస్తవాలు తెలియజేయడం కోసం నిర్వహించే ఈ సమావేశానికి తాను (మోహన్ రెడ్డి), బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి సునీల్ రెడ్డి, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ప్రశాంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉ ంటే వేల్పూర్‌కు రావాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సహాయ పథకాలపై ప్రత్యక్ష సమాచారం తెలుసుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలందరిని, కాంగ్రెస్ కార్యకర్తలను ఈ సభకు పెద్ద ఎత్తున హాజరై, గల్ఫ్ బాధితుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను స్వయంగా చూడాలని, బీఆర్ఎస్ నేత చేస్తున్న తప్పుడు ప్రచారాల వాస్తవాలను గమనించాలని కోరారు. అంతేగాక, తెరాస నేతలు కూడా ఈ సభకు హాజరై, తమ నేత మాటల్లో నిజమెంతుందో తెలుసుకుని, ఆయనకు బుద్ధి చెప్పేలా తమ పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.